

ఆలయాల్లో విశేష పూజలు

గుడ్లవల్లేరు: డోకిపర్రు శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలను మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణ నడుమ వైభవంగా వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను భారీ అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుల సమర్పణ..

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. భక్తులు తమ మొక్కులను భక్తి శ్రద్ధలతో చెల్లించుకున్నారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లను భక్తితో నివేదించి, అమ్మను దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.


భక్తులకు దర్శనమిచ్చిన ఉత్సవ మూర్తులు

మొవ్వలో కృష్ణ జయంతి వేడుకలు..

పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పెదముత్తేవి శ్రీ కృష్ణాశ్రమంలో ఆదివారం ముముక్షుమహా పీఠాధిపతి ముత్తేవి గౌర కృష్ణ గురూజీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుని జన్మ నక్షత్రమైన రోహిణి నక్షత్రం, అష్టమి తిథి కలిసి రావడంతో వైష్ణవ సాంప్రదాయం ప్రకారం ఈ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ వాసులు గురూజీ పర్యవేక్షణలో ఆనందోత్సవాల నడుమ ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.


ఆశ్రమంలో ఉట్టి కొడుతున్న చిన్నారి

ప్రజలకు అవగాహన కల్పించాలి

మండవల్లి: ప్రజలకు అవగాహన కల్పించి గ్రామ సభలలో పాల్గొనేలా చేయాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు అన్నారు. స్టేషన్ సెంటర్‌లోని ఐక్య వేదిక కార్యాలయంలో మండల కమిటీ అధ్యక్షుడు గంజాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో గ్రామ సభల సక్రమ నిర్వహణ, సమాచార హక్కుచట్టం 2005 అమలుపై ఆదివారం చర్చించారు. ప్రజాస్వామ్యం అమలు జరగాలంటే ప్రజలు అవగాహన పరులై ఉండడం.. ప్రభుత్వ యంత్రాంగం జవాబుదారీగా ఉండడం తప్పనిసరి అని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు బండారు వెంకయ్య, మండల ప్రధాన కార్యదర్శి కుందేటి అర్జునరావు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న భాస్కరరావు

యూరియా కొరత లేకుండా చూడాలి

నందివాడ: మండలంలో యూరియా సొసైటీల ద్వారా ఏ విధంగా అందుతుందని ఆదివారం పుట్టగుంట గ్రామ రైతులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అడిగి తెలుసుకున్నారు. రైతులు కలెక్టర్‌తో మాట్లాడుతూ.. యూరియా కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అరిపిరాల చేపల చెరువులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి, ఆర్ఐ గణేష్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్థానికంగా పర్యటించి రైతులతో మాట్లాడారు. రైతుల అవసరాన్ని బట్టి యూరియా పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందొద్దని ఆయన పేర్కొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

ఆర్ఎంపీల ఫెడరేషన్‌కు ఆహ్వానం

గుడివాడ టౌన్: ఆర్ఎంపీల ఫెడరేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును ఫెడరేషన్ నాయకులు కోరారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో నాయకులు ఆదివారం ఆహ్వాన పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్.ఉదయ్ భాస్కర్‌రాజు, జి.నాగ చంద్రశేఖరరావు, సీహెచ్ చంద్రశేఖరరావు, ఎం.శ్రీనివాసులు, పి.సురేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లో కొలువైన శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాము, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావులు పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు.


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు

ఆర్వో ప్లాంట్‌తో సురక్షిత తాగునీరు

ఉరుటూరు(పామర్రు): ఆర్వో ప్లాంట్ ద్వారా సురక్షిత తాగునీరు అందించడం అభినందనీయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఉరుటూరు గ్రామ శివారు నల్లగుంటలో పాస్టర్ స్వర్ణన్‌రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పాస్టర్ స్వర్జన్ రాజు, డీసీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, స్థానికులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాడ(పామర్రు): క్రీస్తు సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిధి అడ్డాడ గ్రామంలోని శిలువ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 30వ తైలాభిషేకం కార్యక్రమ సభలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న దేవినేని లక్ష్మీను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో శిలువ మిషన్ అధినేత క్రీస్తు రాయభారి, లూధియానా అమ్మ, పార్టీ నాయకులు కాటూరి శ్రీనివాసరావు, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

ఉచిత ఉపాధి శిక్షణ కేంద్రం ప్రారంభం

కైకలూరు: అందరికీ సేవ చేయాలనే నినాదంతో సత్యసాయి సేవా సంస్థలు పని చేస్తున్నాయని సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. కైకలూరు సత్యసాయి మందిరం పై అంతస్తులో సత్యసాయి శాశ్వత ఉచిత ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. నవంబరు 13 నుంచి 24 వరకు సత్యసాయి బాబా 100వ పుట్టినరోజు వేడుకలు జరుగుతాయన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

మండవల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు తమ్మిరెడ్డి అప్పారావును ఆదివారం అయ్యప్ప భక్త బృందం ఘనంగా సన్మానించారు. లోకుమూడి ఏలూరు రోడ్డులోని దేవాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అయ్యప్ప, రవి, గూడూరు బాబి, బొల్లెంపల్లి కృష్ణారావు, మాడపాటి చింతయ్య, తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి

గుడివాడ టౌన్: ప్రవర్తన మార్చుకుంటే రౌడీషీట్ తొలగిస్తామని రూరల్ ఎస్సై చంటిబాబు అన్నారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కౌన్సిలింగ్ జరిపామని ఎస్సై వివరించారు. రౌడీ షీటర్ ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తీరు మార్చుకోవాలని ఆయన సూచించారు.


కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై చంటిబాబు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి. సత్యనారాయణ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సన్మానించి అమ్మవారి చిత్ర పటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత ఆ కుటుంబం పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను చేశారు.


ఎస్ఐ సత్యనారాయణకు ప్రసాదం అందిస్తున్న అర్చకులు

ఉచిత కళ్లజోళ్ల పంపిణీ

నిమ్మకూరు(పామర్రు): ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశామని ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈనెల 2న నిమ్మకూరులో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కళ్ల సమస్యలతో ఉన్న వారిని గుర్తించి 50 మందికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశామన్నారు.

మొవ్వ: ఉయ్యూరు శంకర నేత్ర చికిత్సాలయం ద్వారా పెదమాలపల్లిలో ఆదివారం 126 మందికి కంటి వైద్య సేవలు అందించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుప్రజ, ఎంవో ఎం.అనిల్, గుడపాటి నవీన్, కంభం జీవన్, కుమ్మరి రవీంద్ర, గౌతమ్, వేణు, సాయి పాల్గొన్నారు.

17 నుంచి దరఖాస్తుల స్వీకరణ

మండవల్లి: సచివాలయాల ద్వారా ఈనెల 17 నుంచి వాహనమిత్ర కొత్త దరఖాస్తులు స్వీకరిస్తారని ఎంపీడీవో కె.రామలింగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల గురించి మాట్లాడుతూ.. ఏపీలో వాహనం రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుదారు కుటుంబ సభ్యుల్లో ప్రభుత్వ ఉద్యోగులు గానీ, పెన్షనర్‌గా గానీ ఉండరాదన్నారు.

•నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైకలూరు: మరమ్మతుల నిమిత్తం కైకలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కైకలూరు, ఆచవరం, వింజరం, శ్యామలాంబపురం, గోపవరం, రాచపట్నం గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని గుడివాడ విద్యుత్ శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు.